సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం | 6 | మార్చి | 2024



అరటికి తెగుళ్ల బెడద

వాతావరణంలో ప్రస్తుతం ఉష్ణోగ్రతల్లో అధిక వ్యత్యాసాలు, అధిక తేమశాతం ఉండటంతో అరటి పంటకు పలు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. 8లో ▸



సర్పదోష నివారణ పూజలు

తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయంలో కృష్ణా జిల్లా మోపిదేవి దేవస్థానం ఆధ్వర్యంలో కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించారు. 8లో ▸



మద్ది క్షేత్రం కిటకిట

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది అంజనేయస్వామి వారి ఆలయాన్ని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

అన్నదాతకు ఆపన్నహస్తం

తొలకరి పంటకు మిచాంగ్ తుపాను మిగిల్చిన నష్టంతో కుదేలైన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలో పంట నష్టపోయిన 30,459 మంది రైతులకు రూ.25.24 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ సాయాన్ని బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా వారి ఖాతాలకు జమ చేయనున్నారు.

- ఖరీఫ్ చివర్లో మిచాంగ్ తుపానుతో నష్టపోయిన రైతులు
- జిల్లాలో 37,118 ఎకరాల్లోని రూ.25.24 కోట్ల పంట నష్టం
- నేడు 30,459 రైతుల ఖాతాలకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ
- విపత్తు వేళ రైతులకు అండగా నిలుస్తున్న జగన్ ప్రభుత్వం
- గత ఐదేళ్లలో 1,09,556 మందికి రూ.78.2 కోట్ల సాయం
- ఏ సీజన్‌లో నష్టం వస్తే అదే సీజన్‌లో సాయం విడుదల
- గత ప్రభుత్వంలో అరకొర సాయానికి ఏళ్ల తరబడి ఎదురుచూపులు



పంట నష్టం పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

సాక్షి, భీమవరం: ఖరీఫ్ చివరిలో మిచాంగ్ తుపాను కారణంగా రోజుల తరబడి పంటపొలాలు నీట మునిగి పంటనష్టపోయిన రైతులకు ఆదుకునే నిమిత్తం ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ, పరిపాలనశాఖల నుంచి గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులు జిల్లాలోని తుపాను ప్రభావిత 289 గ్రామాల్లో పర్యటించారు. 30,459 మంది రైతులకు చెందిన 37,118 ఎకరాల్లోని పంటకు 33 శాతానికి పైగా నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. వీరిలో 28,402 మంది సన్న, చిన్నకారు రైతులకు చెందిన 31,147 ఎకరాల్లో నష్టం వాటిల్లగా, 2,057 మంది పెద్ద రైతులకు చెందిన 5,971 ఎకరాలు ఉన్నాయి. ముందుగా వరికోతలు పూర్తయిన తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, గణపవరం, పెనుగొండ మండలాల్లో పంటనష్టం తక్కువగా ఉండగా కోతలు ఆలస్యమైన నరసాపురం, వీరవాసరం, పాలకొల్లు, పోడూరు, ఆచంట తదితర మండలాల్లో నష్టం ఎక్కువగా ఉంది. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.6,800 చొప్పున రూ.25.24 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాల్సి ఉంది. రైతులకు ఖాతాలకు మొత్తం సొమ్మును సీఎం వైఎస్ జగన్ జమచేయనున్నారు.

నష్టం వాటిల్లిన సీజన్‌లోనే సాయం

గత టీడీపీ హయాంలో విపత్తులతో పంట నష్టపోయినప్పుడు పరిహారం కోసం రైతులు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. పంట నష్టానికి తోడు సాగుకు పెట్టుబడికి సొమ్ము లేక ఆయినకాడికి రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఉండేది. రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగులో రైతులకు అన్ని విధాలా అండగా ఉంటోంది. విపత్తులతో పంటకు నష్టం వాటిల్లితే అదే సీజన్‌లో పరిహారం అందించేలా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. దీని ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. గత ఐదేళ్లలో 1,09,556 రైతులకు రూ.78.2 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ సాయాన్ని అందజేశారు. తాజాగా మిచాంగ్ తుపానుతో తొలకరి పంటకు నష్టం వాటిల్లిన రెండున్నర నెలల వ్యవధిలోనే ఇన్‌పుట్ సబ్సిడీ సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

గత ఐదేళ్లలో ఇన్‌పుట్ సబ్సిడీ సాయం వివరాలు

సంవత్సరం	రైతులు	ప్రభుత్వ సాయం (రూ.లలో)
2019	509	25.17 లక్షలు
2020	79,430	56.89 కోట్లు
2021	27,935	19.87 కోట్లు
2022	1,378	90.56 లక్షలు
2023	304	23.50 లక్షలు



మిచాంగ్ తుపాను ధాటికి కాళ్ల మండలంలో నేలనంటిన వరిచేలు (ఫైల్)

ఇన్‌పుట్ సబ్సిడీతో ఊరట



నేను రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఎకరాకు దాదాపు రూ.20 వేల వరకు పెట్టుబడి ఖర్చులు అయ్యాయి. సార్వా పంట చేతికి వచ్చే సమయంలో తుపాను వల్ల చేనంతా పడిపోయింది. రెండు ఎకరాల్లో పంట సగానికి సగం పోయింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పంట నష్ట పరిహారంతో కొంతవరకు ఊరట కలిగింది.

– బుడితి పెద్దిరాజు, జిన్నూరు, పోడూరు మండలం

సాగుపై భరోసా కల్పించారు



నాకు ఎకరం సొంత భూమి ఉంది. గతంలో వరి వేయాలంటే ప్రకృతి వైపరీత్యాలకు భయపడవలసి వచ్చేది. పంట నష్టపోతే ఆదుకునే నాథుడు లేక వ్యవసాయం అంటే భయపడేవాళ్లం. జగన్ వచ్చాక నాలుగేళ్లుగా సాగుపై నమ్మకం కలిగింది. నా పొలంతో పాటు 10 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. నాకు పెన్షన్, మా మనవళ్లకు అమ్మ ఒడితో పాటు నా భార్యకు చేయూత కూడా వస్తోంది.

– విస్సంశెట్టి చంద్రరావు, రైతు, వెలమపేట, పెనుమంట్ర మండలం

జగన్ ప్రభుత్వంలోనే రైతులకు మేలు



నాకు మూడెకరాల సొంత భూమితో పాటు మరో ఎకరంన్నర కౌలుకు సాగు చేస్తున్నాను. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి ఏడాది రైతు భరోసా సొమ్ము రూ.13,500 అందుతోంది. 2020, 2021 సీజన్లలో వర్షాల వలన పంట నష్టం వాటిల్లినప్పుడు క్రాప్ ఇన్సూరెన్స్ కింద రూ.29,716, రూ.17,534 అందాయి. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.18 వేలు, రూ.13 వేలు సాయం అందింది. జగన్ ప్రభుత్వంలోనే రైతులకు మేలు జరిగింది.

– తోలేటి వెంకటేశ్వరరావు, తిరుపతిపురం, అత్తిలి మండలం

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

భీమవరం: దాళ్వా సీజన్‌లో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కై గాల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ సలహా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని శివారు ప్రాంతాల్లో వరి పంటకు సాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సాగునీరు తగినంతగా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కాలువల్లో నీటి ప్రవాహానికి కర్రనాచు అడ్డుగా ఉండడం వల్ల నీటి పారుదలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అటువంటి ప్రాంతాలను గుర్తించి కర్రనాచు తొలగింపునకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో కనీసం ఐదుగురు రైతులను కలిసి ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించాలన్నారు.

వారంలోగా ధాన్యం బకాయిలు చెల్లిస్తాం

ఈకేవైసీలో ఇబ్బందుల కారణంగా జిల్లాలో ఇంకా 1,905 మంది రైతులకు రూ.16.24 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని, వారం రోజుల్లో నగదు జమ చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ స్పష్టం చేశారు. గత ఖరీఫ్ సీజన్లో 68,796 మంది రైతులకు ధాన్యం కొనుగోలు నిమిత్తం రూ.926.67 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు 66,891 మంది రైతులకు రూ.910.43 కోట్లు చెల్లించామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కై గాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రబీ పంటకు అవసరమైన గోనె సంచులను ముందస్తుగా సిద్ధం చేయాలని, సాగునీటి వంతుల వారి విధానంలో సంబంధిత గ్రామ వ్యవసాయ అధికారి ముందుగా రైతులకు సమాచారం అందించాలని కోరారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, నీటిపారుదల శాఖ ఈఈ ఎం.దక్షిణామూర్తి, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మురళీకృష్ణ, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కొట్టి కుటుంబరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం
ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్



పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ జీవీజీ అశోక్ కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితుల్లో పోలీస్ సిబ్బంది వాటిని అదుపులోకి తెచ్చేందుకు నిత్యం లాఠీ డ్రిల్, వెపన్ డ్రిల్, మాబ్ డ్రిల్ ప్రాక్టీస్ చేస్తూ ఉండాలని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు సిబ్బంది అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ ఎన్నికల నియమావళిని అమలు చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. తొలుత సాయుధ బలగాల కవాతును వీక్షించారు. అనంతరం పోలీస్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జిల్లా ఎస్పీ డి. మేరి ప్రశాంతి ఆదేశాల మేరకు ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్ ఆధ్వర్యంలో జిల్లా ఏఆర్ సిబ్బంది ఆర్ఐ పవన్‌కుమార్ కమాండర్‌గా కవాతును నిర్వహించారు. అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ శాఖలోని వివిధ విభాగాలైన ఏఆర్, బెల్ ఆఫ్ ఆర్మ్స్, డాగ్ స్క్వాడ్, బీడీ టీమ్, ఎంటీఓ, ఆర్ఐ స్టోర్స్ తదితర విభాగాలకు సంబంధించిన రికార్డులను ఐజీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అనువైన వాతావరణాన్ని పోలీస్ సిబ్బంది కల్పించాలన్నారు. నిబంధనల మేరకు ఎన్నికల విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఈ తనిఖీల్లో జిల్లా అదనపు ఎస్పీ జీ స్వరూపారాణి, ఎస్‌బీ సీఐలు మల్లేశ్వరరావు, ఆదిప్రసాద్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు ఉన్నారు.

మహాశివరాత్రికి పటిష్టంగా బందోబస్తు



పంచారామ క్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల

భీమవరం (ప్రకాశం చౌక్): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల్లో పటిష్టంగా బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశించారు. గునుపూడిలోని పంచారామక్షేత్రంలో బుధవారం నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం ఆమె ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్ల ద్వారా దర్శనానికి పంపించాలన్నారు. పటిష్టంగా బందోబస్తు నిర్వహించాలని డీఎస్పీ నారాయణస్వామి రెడ్డిని, ఇతర పోలీసు అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని బట్టి ఎప్పటికప్పుడు చర్యలు చేసుకోవాలన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ సీఐను ఆదేశించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ భీమారావు, వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను, ఎస్సై వెంకటేశ్వరరావు ఉన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

భీమవరం: పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ వి.అజిత ఆదేశించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో శనివారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక అధికారులను నియమించాలని, అక్కడ అనుసరించాల్సిన కార్యాచరణపై సూచనలు చేశారు. సమీక్షలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షకు 98 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షకు 98 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా జనరల్ విద్యార్థులు 13,846 మంది హాజరుకావాల్సి ఉండగా 13,567 మంది, ఒకేషనల్ కోర్సులకు 1,414 మందికి 1,336 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు, మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చంద్రశేఖర్‌బాబు చెప్పారు.

పాలనలో అసమర్థుడు చంద్రబాబు



వీరంపాలెంలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ
- వీరంపాలెంలో ఆర్బీకే, సచివాలయం భవనాల ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క పథకం లేదని, పాలనలో అసమర్థుడు చంద్రబాబు అని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం సాయంత్రం వీరంపాలెంలో మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆర్బీకే, సచివాలయ భవనాలను ప్రారంభించి బ్రిడ్జి, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నాడు కల్లబొల్లి మాటలు చెప్పి 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాడన్నారు. అధికారం కోసం చంద్రబాబు చేయని నీచమైన కార్యక్రమాలు లేవన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ నేటికీ నిరాటంకంగా కొనసాగుతుందని, ఇదంతా వైఎస్సార్ చలవేనని పేర్కొన్నారు. తండ్రి బాటలోనే సీఎం వైఎస్ జగన్ పాలన అందిస్తున్నారన్నారు. సమర్థుడైన సీఎం ఉంటే ఏం చేయగలడో సీఎం జగన్ చేసి చూపించారని కొనియాడారు. ఆడపడుచులకు చంద్రబాబు చేసిన ద్రోహంతో ఆయన ఎన్నటికీ సీఎం కాలేడని జోస్యం చెప్పారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2.75 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. వీరంపాలెంలో రూ.8 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి, మరో 24.5 కోట్లతో కొమ్ముగూడెం మీదుగా బ్యాంజంపూడి వరకు రోడ్డు నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. ప్రజలు మంచి ఆలోచన చేసి రాష్ట్రంలో సీఎం జగన్, నియోజకవర్గంలో తనను గెలిపించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, జెడ్పీటీసీ ముత్యాల అంజనేయులు, సర్పంచ్ కేతిరెడ్డి మాధవి, ఎంపీటీసీ సభ్యులు జంపెల్లి సత్యవతి, మార్ల పూడి సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులు రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, నాయకులు కేతిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు వైఎస్సార్‌సీపీలో పెద్దపీట

- ఎంపీ మిథున్‌రెడ్డి
- భీమవరంలో పార్టీ పార్లమెంట్ కార్యాలయం ప్రారంభం



భీమవరంలో వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మిథున్‌రెడ్డి

భీమవరం: బీసీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, నరసాపురం పార్లమెంట్‌కు తొలిసారిగా బీసీ మహిళ గూడూరి ఉమాబాలకు కేటాయించిందని ఎంపీ, ఉభయగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి అన్నారు. భీమవరంలో మంగళవారం నరసాపురం పార్లమెంట్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడారు. విద్యావంతులను పార్లమెంట్‌కు పంపిస్తే ఆయా ప్రాంతాలు అభివృద్ధి పథంలో ముందుంటాయని అందువల్లనే నరసాపురం పార్లమెంట్‌కు వైఎస్సార్‌సీపీ అభ్యర్థినిగా విద్యావంతురాలు, బీసీ వర్గానికి చెందిన ఉమాబాలను ఎంపిక చేశారన్నారు. రాష్ట్రంలో వినూత్నమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు విపరీతమైన అభిమానం ఉందని, దీనిని ఓట్లుగా మలుచుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన సభలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్‌కు ఉన్న చరిత్రను రానున్న ఎన్నికల్లో ఉమాబాలను గెలిపించడం ద్వారా తిరగరాయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ఉమాబాలను గెలిపించాలన్నారు. ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాలో రాజకీయంగా సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారని రెండు జిల్లాల్లో మూడు పార్లమెంట్ స్థానాలను బీసీలకు కేటాయించడం ద్వారా బీసీలకు పార్టీలో ఇస్తున్న ప్రాధాన్యత అవగతమవుతోందన్నారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి ఉమాబాల మాట్లాడుతూ బీసీలు వెనుకబడిన వర్గాలు కాదు వెన్నుముఖ వంటి వారని నిరూపించిన జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలంతా వెన్నంటి ఉండాలన్నారు. సామాజిక న్యాయం మాటల్లో గాకుండా చేతల్లో చూపించిన దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు పీవీఎల్ నర్సింహరాజు, గుడాల శ్రీహరిగోపాలరావు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్ కుమార్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్, మైనార్టీసెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం

- ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు
- చిలుకూరు, పెదపుల్లేరులో సచివాలయాలు, ఆర్బీకే కొత్త భవనాల ప్రారంభం



చిలుకూరులో సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు, ఎమ్మెల్సీ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి: వైఎస్ జగన్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి చిరునామాగా మారాయని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో మండలంలోని చిలుకూరులో గ్రామ సచివాలయ భవనం, పెదపుల్లేరులో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలకు నిర్మించిన కొత్త భవనాలను ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ప్రారంభించారు. అలాగే చిలుకూరులో సీఎం ప్రత్యేక నిధులు రూ.కోటి వ్యయంతో నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా చిలుకూరు సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు, పెదపుల్లేరులో సర్పంచ్ కరణం పార్వతి అధ్యక్షతన నిర్వహించిన సభల్లో చీఫ్ విప్ ప్రసాదరాజు, ఎమ్మెల్సీ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైఎస్ జగన్ పాలనలోనే సాధ్యమైందన్నారు. మహనీయుల ఆశయాలను సాధించే దిశగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్న ఒకే ఒక్క సీఎం వైఎస్ జగన్ అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి సచివాలయానికి కనీసం 11 మంది వివిధ శాఖల సిబ్బందిని నియమించి అన్ని ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంచారని అన్నారు. ధ్రువపత్రాలు, రిజిస్ట్రేషన్లు, దరఖాస్తులు ఇలా అన్ని సేవలు గ్రామాల్లోనే లభిస్తున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు ఎన్నో విలువైన సేవలు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నామన్నారు. సచివాలయ భవనానికి రూ.40 లక్షలు, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ భవనానికి రూ.20 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ నాయకుల దొంగ వాగ్దానాలు నమ్మి ఉండిలో వారిని గెలిపించారని, అయితే ఉండిలో మరింత అభివృద్ధి జరగాలంటే పీవీఎల్ నర్సింహరాజును తప్పక గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అప్పుడే నియోజకవర్గ ప్రజలు సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమానికి రుణం తీర్చుకున్నట్లు అవుతుందన్నారు. ప్రజలు అడక్కుండానే ఎన్నో చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మరోసారి అవకాశం ఇస్తే మరిన్ని అద్భుతాలు చేస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు బటన్ నొక్కి మరింత సంక్షేమాన్ని సాధించుకుందామన్నారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యులు రణస్థల కనకదుర్గ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్కే అంజనేయరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొప్రాటి అనిత, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు, చేకూరి శ్రీనివాసరాజు, ఉప సర్పంచ్ పరమేశ్వరరాజు పాల్గొన్నారు.

7న రెండు పరిశ్రమల్లో మాక్ డ్రిల్

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని కర్మాగారాలలో విపత్తులు జరగకుండా ముందస్తు జాగ్రత్తలపై ఈ నెల 7న మాక్ డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ కమాండెంటు ఆదిత్య కుమార్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టరు ఆర్ కుర్మనాథ్ వెబ్‌ఎక్స్ ద్వారా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తణుకు వెంకటరాయపురం ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్, పాలకొడేరులోని ఆనంద ఎంటర్ ప్రైజెస్ పరిశ్రమల్లో ఈ నెల 7వ తేదీన మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు చెప్పారు. మాక్‌డ్రిల్‌లో దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే బాధితులకు సత్వర చికిత్స అందించి ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల కర్మాగారాల ఇన్‌స్పెక్టర్ త్రినాథ్, జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి యు.మంగపతిరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వికలాంగుల మహాగర్జనకు తరలిరావాలి



మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు కందుల రమేష్

ఏలూరు (టూటౌన్): మార్చి 8న విజయవాడలో జరిగే వికలాంగుల మహాగర్జన కార్యక్రమానికి జిల్లాలోని వికలాంగులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ కోరారు. స్థానిక ఇజ్రాయిల్ పేట కమ్యూనిటీ హాలు నందు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగులకు పింఛన్ రూ.6 వేలకు పెంచాలని తదితర మొత్తం 21 డిమాండ్లతో మహాగర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బయ్యారపు రాజేశ్వరరావు, సింగంశెట్టి అనూష, కవులూరి దుర్గారావు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

అత్తిలి: మైనర్ బాలికను అత్యాచారం చేశాడనే ఆరోపణపై పూలపర్తి అయ్యప్ప అనే యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసినట్లు అత్తిలి పోలీసులు మంగళవారం తెలిపారు. ఈడూరు గ్రామానికి చెందిన అయ్యప్ప గత నెల 18న, తిరిగి 26 రాత్రి అత్తిలిలో మైనర్‌బాలిక నిద్రిస్తున్న గదిలోకి చొరబడి అత్యాచారం చేసిన సంఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే కేసు నమోదు చేశారు. ఈ మేరకు మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి తణుకు కోర్టులో హాజరుపర్చడంతో [illegible] రిమాండ్ విధించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదవేగి: అదుపుతప్పి కిందపడి తలకు గాయమైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదవేగి ఎస్సై వీ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన కలపాల చిన్న రాజు(60) ఈ నెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళ్తుండగా కళ్లు తిరిగి కిందపడిపోయాడు. ఈ సంఘటనలో తలకు గాయమవ్వడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు ఏలూరు జిల్లా కేంద్ర సర్వజన ఆసుపత్రి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చిన్నరాజు మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు.

అరటి పంటలో తెగుళ్ల మంట

నివారణ చర్యలతో సమస్య దూరం

పాడి - పంట

చింతలపూడి: అరటి ఉద్యాన పంట. ఉమ్మడి పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాలో దాదాపు 12,076 హెక్టారుల్లో అరటి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణం ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, అధిక తేమ శాతం ఉన్నందున అరటిలో ఆకుమచ్చ తెగుళ్లు, దుంప కుళ్లు తెగుళ్లు ఆశిస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో 28 నుంచి 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా, 70 నుంచి 75 శాతం తేమ ఉంటోంది. వీటి ప్రభావంతో సిగటోక ఆకుమచ్చ తెగులు, పనామా దుంపకుళ్లు తెగులు, బాక్టీరియా దుంపకుళ్లు తెగులు ఆశిస్తోంది. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ దుర్గేష్ రైతులకు పలు సూచనలు అందించారు.





జిల్లాలోని మెట్ట ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న అరటి తోట, మెట్ట ప్రాంతంలో తెగులు సోకి రంగుమారిన అరటి చెట్టు

సిగటోక ఆకు మచ్చ తెగులు

ఈ తెగులు వర్షాకాలంలో జూలై నుంచి ఎక్కువగా ఉంటుంది. తెల్ల చక్రకేళి, పచ్చ అరటి, బొంతలో ఎక్కువగా ఆశిస్తుంది. ముందుగా కింది ఆకులపై చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ పెరిగి మధ్యలో బూడిద రంగు కలిగి ఉంటాయి. ఈ మచ్చలు గోధుమ రంగులోకి మారి పరిమాణంలో పెద్దవై ఒకదానితో ఒకటి కలసిపోయి ఆకుమొత్తం ఎండిపోతుంది.

నివారణ: ఒక నెల వ్యవధిలో నివారణ మందు 4–5 సార్లు పిచ్చికారీ చేసుకున్నపుడు తెగులు ఉధృతి సమర్థవంతంగా అరికట్టవచ్చు. తెగులు మందులు కూడా మార్చిడి చేస్తూ పిచికారీ చేయాలి. మొదటి పిచికారీ ప్రోపికొనజోల్ 1 మిల్లీ లీటర్ నీటికి, రెండో పిచికారీ కర్బెండజిమ్, మంకోజేబ్ మిశ్రమాన్ని 1 గ్రాము లీటర్ నీటికి, మూడో పిచికారీ ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్, టేబుకొనజోల్ మిశ్రమాన్ని 1.5 గ్రాము లీటర్ నీటికి, నాలుగో పిచికారీ డైఫెనకొనజోల్ 1 మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పనామా దుంప కుళ్ళు తెగులు

ఈ తెగులు నీటి వాహికలను ఆశించడం వల్ల వస్తుంది. కింది ఆకులు పసుపు బారి ఎండిపోయి వాలిపోతాయి.

నివారణ: తెగులు రహిత తోటల నుంచి మాత్రమే పిలకలు ఎంపిక చేసుకోవాలి. పిలకలను సుడోమొనస్ లేదా మజేబ్ లేదా కర్బెండాజిమ్ ద్రావణంతో శుద్ధి చేసుకోవాలి. తెగులు ఎక్కువ గా ఉన్న తోటల్లో వరి పంట వంటి వాటితో పంట మార్పిడి చేసుకోవాలి.

బాక్టీరియా దుంప కుళ్లు తెగులు

ఈ తెగులు చక్రకేళిలో ఎక్కువగా ఆశిస్తోంది. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు చిన్న మొక్కలకు నీటి తడులు ఇచ్చినప్పుడు ఎక్కువగా వ్యాపిస్తుంది. భూమికి దగ్గర భాగములో కాండము (దొప్పలపై) కుళ్ళు మచ్చలు ఏర్పడి క్రమేపీ దుంప కుళ్లిపోయి వాసన వస్తుంది. ఆకులు పసుపు రంగులోకి మారి బొందపై పగుళ్ల ఏర్పడి చిన్నపాటి గాలులకే చెట్టు పడిపోతుంది.

నివారణ: తెగులు ప్రాథమిక దశలో బ్లీచింగ్ పౌడర్ 25 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొదలు తడిచేలా పోయాలి. తెగులు ఎక్కువగా ఉన్నప్పుడు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ 3 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి మొదలు తడిచేలా పోయాలి. ఈ విధంగా ఉద్యాన అధికారుల సూచనలు పాటిస్తే తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవడమే కాక అధిక దిగుబడులు కూడా సాధించవచ్చు.



ఎ.దుర్గేష్ - ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

ఘనంగా కాలసర్ప దోష నివారణ పూజలు



కాలసర్ప దోష నివారణ పూజలు చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు



కాలసర్ప దోష నివారణ పూజల్లో పాల్గొన్న భక్తులు

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక బలుసులమ్మ అలయం ప్రాంగణంలో మంగళవారం కృష్ణాజిల్లా మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో కాలసర్ప దోష నివారణ పూజలు చేశారు. ఈ పూజల్లో తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సతీమణి సౌదామిని కుమారి దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విశిష్టతను వివరించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి లింగాకృతిలో ఉండే భారతదేశంలోనే ఏకైక దేవస్థానం ఇది ఒక్కటే అన్నారు. ఆలయంలోని పుట్టలోనుంచి సర్పం వచ్చి దర్శనమిస్తుందని తెలిపారు.

రూ. కోట్ల నిధులతో రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి

రాష్ట్రంలోని దేవాలయాలను వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. రూ.155 కోట్లతో కాణిపాకం వినాయక స్వామి వారి దేవస్థానం, రూ.215 కోట్లతో శ్రీశైలం దేవస్థానం ఇలా ప్రముఖ దేవాలయాలతోపాటు ఇతర దేవాలయాలను అభివృద్ధి చేయిస్తున్నామన్నారు. దేవదాయ శాఖ మంత్రిగా భగవంతుడు తనకు అవకాశం కల్పించడంతో ఆ అదృష్టాన్ని మన నియోజకవర్గ ప్రజలకు కూడా కలిగించాలని ఉద్దేశంతో ధర్మ ప్రచారంలో ఆ అదృష్టాన్ని మన ప్రజలకు కల్పించామన్నారు. కార్యక్రమంలో ప్రఖ్యాత వేదపండితులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి, చెన్నా జనార్ధనరావు, బోడగిరి చినబాబు, రాతా శ్రీనివాసరావు, శ్రీబలుసులమ్మ అలయ కమిటీ ఛైర్మన్ కొట్టు అంజిబాబు, నిర్వాహకులు వట్టిప్రోలు రాము, పెదప్రోలు వెంకట భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

జనసేన సమావేశంలో రచ్చ..రచ్చ



ఆచంటలో మాజీ మంత్రి కొత్తపల్లి ఎదుటే వాగ్వివాదానికి దిగిన జనసేన నేతలు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గ జనసేన విస్తృత స్థాయి సమావేశం రసాభాసగా మారింది. మంగళవారం రాత్రి ఆచంట కమ్మవారి సత్రంలో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశం ప్రశాంతంగా ప్రారంభమైనా చివరకు గలాటాగా మారింది. గతంలో మండల కన్వీనర్ల నియామకంపై ఏర్పడిన వివాద ప్రభావం విస్తృత స్థాయి సమావేశంలో రగడగా మారింది. పార్టీలో కష్టపడిన వారికి స్థానం లేకుండా పోయిందని, విలువలేకుండా చేశారని, కొందరు జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీకు జనసేనలో పదవులు కేటాయించరా? అంటూ మరికొందరు నిలదీశారు. సత్వరం మండల కన్వీనర్లను మార్చాలంటూ డిమాండ్ చేశారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానంటూ కొత్తపల్లి భరోసా ఇచ్చినా ఎవరూ లెక్క చేయలేదు.

నృసింహ మహా యజ్ఞానికి అంకురార్పణ



సుందరగిరిపై నృసింహ మహా యజ్ఞానికి అంకురార్పణ చేస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాధపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శ్రీ రుద్ర సుదర్శన సహిత నృసింహ 30వ మహా యజ్ఞం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. యాగశాలలో పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ అంకురార్పణ చేసి యజ్ఞ క్రతువును ప్రారంభించారు. బుధ, గురువారాల్లో నారసింహుని ఆలయం వద్ద యజ్ఞాది కార్యక్రమాలు, విశేష పూజలు జరుగనున్నాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 8న రాత్రి మహా యజ్ఞాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని హైదరాబాద్‌కు చెందిన యజ్ఞ నిర్వాహకులు కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురుజీ తెలిపారు. 9న శాంతి కల్యాణాన్ని కన్నులపండువగా జరుపుతామన్నారు. యజ్ఞ ఏర్పాట్లను సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షిస్తున్నారు.

కలుపుమందు తాగి వివాహిత ఆత్మహత్య

పెదవేగి: మతిస్థిమితం లేని ఓ మహిళ కలుపు మందు తాగి మృతి చెందిందని పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ చెప్పారు. బి.సింగవరం గ్రామానికి చెందిన పామర్తి రామలక్ష్మికి వివాహమై 6 నెలలు అయ్యింది. గత నెల 18న ఇంట్లో ఉన్న కలుపు మందు తాగేసింది. దీంతో ఆమెను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో రామలక్ష్మి(20) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. అక్కడ నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన కళాపరిషత్ నాటకోత్సవాలు



మూల్యం నాటికలోని ఓ దృశ్యం



ఇంద్రప్రస్థం నాటికలోని ఓ సన్నివేశం

పాలకొల్లు సెంట్రల్: గత 69 ఏళ్లగా సినీరంగానికి రాని జాతీయ ఉత్తమ నటుడు అవార్డు పాలకొల్లు బిడ్డగా అల్లు అర్జున్‌కు రావడం గర్వకారణమని సినీ నిర్మాత బన్నీ వాసు అన్నారు. మంగళవారం పాలకొల్లు పట్టణంలో కళాపరిషత్ ఆధ్వర్యంలో అద్దేపల్లి గంగరాజు సత్రంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 15వ జాతీయ స్థాయి నాటికల పోటీలు ముగింపు కార్యక్రమానికి వాసు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ కళలకు నిలయమైన పాలకొల్లు ఎంతోమంది కళాకారులను అందించిన పుణ్యభూమని అన్నారు. గత ఐదేళ్లుగా కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో తమవంతు సహాయసహకారాలు అందిస్తున్నామన్నారు. ఇలాంటి కళాక్షేత్రం నుండి మరింతమంది నూతన కళాకారులు వెలుగులోకి రావాలని ఆశిస్తున్నానన్నారు. సినిమా రంగంలో ఒక సీన్ తీయాలంటే అనేక టేక్‌లను తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. కానీనాటక రంగంలో అలా కాదని ఎన్ని గంటలైనా ఏకధాటిగా నటించాల్సిందేనన్నారు. ఎంతో కృషి పట్టుదల ఉంటేనే గాని ఆ నటనను ప్రదర్శించలేమన్నారు.

రెండు నాటకాల ప్రదర్శన

చివరి రోజు రెండు నాటికలను ప్రదర్శించారు. నేటి మన సమాజంలో ఆడపిల్లల మీద అడుగడుగునా రకరకాల ఆంక్షలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో లింగ వివక్షతకు వ్యతిరేకంగా ఓ వివాహిత మహిళ సాధించిన విజయాన్ని గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారి మూల్యం నాటిక ద్వారా ప్రదర్శించారు. యువత ప్రేమ విషయంలో తండ్రి పాత్రతో పాటు ప్రేమికుల సన్మార్గంలో నడిపించేలా ఓ తండ్రి పడిన కష్టాన్ని అభినయ ఆర్ట్స్ , గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణవర్మ, సెక్రటరీ మానాపురం సత్యనారాయణ, విశాకుల రమణ, దాసరి నాని, మేడికొండ శ్రీనివాసు, రెడ్డి వాసు, కె. గుప్త, అంగర వీరబద్రకుమార్, సోమంచి శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

మహిళల్లో ఆర్థిక నిర్వీర్యతను దూరం చేయాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర కమిషనర్ శారదాదేవి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళల్లో ఆర్థిక నిర్వీర్యతను దూరం చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదా దేవి పిలుపునిచ్చారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది మహిళా దినోత్సవ థీమ్‌గా ఇన్‌స్పైర్ ఇంక్లూజన్ అనే అంశాన్ని ప్రకటించినట్లు వివరించారు. మహిళల్లో పెట్టుబడులను వేగవంతం చేయడానికి ఈ థీమ్‌తో సాధ్యమవుతుందన్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తించి, గౌరవించడానికి లింగ సమానత్వం, సామాజిక మార్పుకు ప్రేరణ తీసుకురావడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేదికగా ఉపయోగపడుతుందన్నారు. సమాజంలో నేటికీ మహిళలు లింగ వివక్షకు గురౌతున్నారని, ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా ఎంత ప్రగతి సాధించినా వారు అణచివేతకు గురౌతూనే ఉండడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు ఫ్యాన్సీ డ్రెస్, డ్యాన్స్ పోటీలు నిర్వహించడంతో పాటు సమాజంలో ఉన్నతంగా గుర్తింపు పొందిన మహిళల జీవిత చరిత్రలను ఏకపాత్రాభినయం ద్వారా విద్యార్థినిలు ప్రదర్శించారు. అనంతరం శారదాదేవిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ సిస్టర్ మెర్సీ,సెట్‌వెల్ సీఈఓ. ఎండీహెచ్ మెహరాజ్, నేషనల్ కెరీర్ సర్వీస్ జిల్లా కో–ఆర్డినేటర్ జే. ప్రవీణ్ కృష్ణ, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

దూరప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందజేత

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం ములగలంపల్లికి చెందిన దూబగుంట్ల దుర్గాలక్ష్మి అనే వృద్ధురాలు అనారోగ్యం కారణంగా విజయవాడలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లి అక్కడే ఉంటూ వైద్యం పొందుతుంది. అయితే ఇటీవల ఆమెకు పింఛన్ ఇవ్వడానికి వెళ్లిన వలంటీర్ కసుల ఆదినారాయణ విషయం తెలుసుకుని మంగళవారం విజయవాడ వెళ్లి మార్చి నెల పింఛను దుర్గాలక్ష్మికి అందించాడు. తన సొంత ఖర్చులతో విజయవాడ వెళ్లి పింఛను ఇచ్చిన వలంటీర్‌కు పలువురు అభినందించారు.

వైజాగ్ వెళ్లి పింఛన్ అందజేత

ఆకివీడు: మండలంలోని చినమిల్లిపాడు సచివాలయ పరిధిలోని కాళింగగూడెం గ్రామానికి చెందిన పూజారి రంగారావు కిడ్నీ సమస్యతో వైజాగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యానికి ఆసరాగా పింఛన్ సొమ్ము రూ.10 వేలు ఉంటుందని భావించిన గ్రామ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎం. యోబు రాజు వైజాగ్ వెళ్లి రంగారావుకు పింఛన్ సొమ్ము అందజేశారు. ఆ ప్రాంతానికి చెందిన వలంటీర్ మహిళ కావడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ రాజు వైజాగ్ వెళ్లి పింఛన్ అందజేయడం పట్ల రంగారావు, బంధువులు అభినందించారు.



ఆకివీడు: వైజాగ్ ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి ఎం.యోబురాజు



పెనుగొండ: వైజాగ్ ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న దేవ వలంటీర్ శిరీష

నరసాపురంలో..

నరసాపురం రూరల్: పట్టణంలోని 4వ సచివాలయం 8వ వార్డు నందమూరు కాలనీకి చెందిన బొల్లం వరలక్ష్మి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ గత కొద్దిరోజులుగా విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈమె వృద్ధాప్య పింఛను తీసుకుంటున్నారు. ఈమె కుమార్తె చల్లా శైలజ వితంతు పింఛను తీసుకుంటున్నారు. తల్లి వరలక్ష్మికి సే వచేసేందుకు ఈమెకూడా తల్లితో పాటు విజయవాడలోని ఓ ఆసుపత్రిలో ఉన్నారు. వీరి ఇరువురికి పింఛన్ అందించేందుకు వలంటీర్ ఒడుగు నాగ శశిరేఖ తన భర్త శివకృష్ణను వెంట బెట్టుకుని మంగళవారం విజయవాడ ఆసుపత్రి ఇద్దరికీ పింఛన్లు అందించింది. వలంటీర్‌ను, ఆమె భర్తను సచివాలయ సిబ్బంది, నాయకులు అభినందించారు.

పెనుగొండలో..

పెనుగొండ: అనారోగ్యంతో వైజాగ్ ఆసుపత్రిలో కాలుకు శస్త్ర చికిత్స చేయించుకొంటున్న దేవకు చెందిన ఈద సన్నీకు దేవ వలంటీరు చిల్లా శిరీష మంగళవారం వైజాగ్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందించి సీఎం జగన్ ఆశయాలను నెరవేర్చింది. నిబద్ధతను చాటుకొన్న శిరీషను దేవ సర్పంచ్ నల్లూరి సత్యనారాయణ, పెనుగొండ వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ సాకా సుబ్రహ్మణ్యం అభినందించారు.

సమాజ సేవకులు వలంటీర్లు

తణుకులో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి కారుమూరి


తణుకులో వలంటీర్లను సత్కరించిన మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్ : సమాజ సేవలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు శ్రీబాలగంగాధర తిలక్ మున్సిపల్ ఆడిటోరియంలో మంగళవారం తణుకు రూరల్ పరిధిలోని నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాసంక్షేమార్థం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించిన వలంటీరు వ్యవస్థ అవ్వాతాతలు, దివ్యాంగులకు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా కోవిడ్ రెండేళ్లు కూడా వలంటీర్లు అందించిన సేవలకు కొలమానం లేదని, ప్రజాదీవెనలే మీకు శ్రీరామరక్షగా పనిచేస్తాయని అన్నారు. కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా సంక్షేమం అందజేసి జగనన్న ఆదేశాలు తూచాతప్పకుండా పాటించి వలంటీర్లు అందరి మనసులు గెలుచుకున్నారని అన్నారు.

పారదర్శకంగా సంక్షేమం.

50 ఇళ్లకు ఒక వలంటీరును ఏర్పాటు చేసి వారికి సంక్షేమం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా గొప్ప ఆలోచన చేశారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నూరు శాతం పారదర్శకంగా సంక్షేమం అందుతుందని స్పష్టం చేశారు. వలంటీరు చేస్తున్న సేవలకు వృద్ధులు, పింఛనుదారుల ముఖాల్లో చిరునవ్వు, సంతోషం కనిపిస్తోందని, పింఛన్లతోపాటు ఏ కుటుంబానికి ఏ సంక్షేమం ఇవ్వవచ్చో అనే విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేస్తి, సదరు సంక్షేమాన్ని అందిస్తున్న వలంటీర్లు అభినందనీయులని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు సాధించిన వలంటీర్లను ప్రత్యేకంగా సత్కరించి ధ్రువపత్రాలు, మెడల్స్ అందజేశారు. వైఎస్సార్ సీపీ తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీలలిత, ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, నియోజకవర్గ పరిశీలకులు జక్కంపూడి సత్యరాజేంద్రప్రసాద్, తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, సర్పంచ్‌లు అడ్డా బాబు, చిన్నయ్య, కరిబండి రాజేష్, పాలా శ్రీను, సత్యనారాయణ, వేల్పూరు గ్రామ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, శిరిగినీడి గోపాలకృష్ణ, గ్రామ అధ్యక్షుడు బుల్లి నాగు, ఎంపీటీసీ సభ్యురాలు చంద్రు శ్యామల కుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


దివ్యాంగుడైన వలంటీరుకు రూ. 20వేలు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మానసపుత్రిక అయిన వలంటీరు వ్యవస్థకు సంబంధించి తణుకు నియోజకవర్గంలో ఏ వలంటీరు ఇబ్బందుల్లో ఉన్న అండగా నిలబడతానని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం తణుకులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన వలంటీరు నారపురెడ్డి మెంటరాజుకు మంత్రి కారుమూరి రూ. 20వేలు ఆర్థికసాయం అందజేశారు. మెంటరాజు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇబ్బందుల్లో ఉన్నాడని, కారుమూరి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ సాయాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాకర్స్ సేవలు మరువలేనివి


విద్యార్థులకు నిత్యావసరాలు అందజేస్తున్న వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో వాకర్స్ చేస్తున్న సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. వాకర్స్ ఆధ్వర్యంలో స్థానిక కొండయ చెరువు సమీపంలోని లార్డ్ ఆఫ్ లైఫ్ ఆశ్రమంలోని విద్యార్థులకు మంగళవారం బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, విద్యాసామాగ్రి, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. విద్యార్థులు చక్కని చదువులు చదివితే తమ వంతు సహాయ సహకారాలు తప్పక ఉంటా యని ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు దుగ్గిన వెంకట లక్ష్మి, భువన, కార్యదర్శి కుంట్ల కనక దుర్గ, కోశాధికారి సీహెచ్ ఇందిరా కుమారి, రామలక్ష్మి, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

దండగర్ర విద్యార్థుల ప్రతిభ


పోస్టర్ ప్రజంటేషన్‌లో ప్రశంసా పత్రాలు అందుకున్న దండగర్ర విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: యూరోపియన్ ఆర్గనైజేషన్ ఫర్ న్యూక్లియర్ రీసెర్చ్, టీమ్ లైన్ ఫర్ స్కూల్స్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ పోస్టర్ ప్రజంటేషన్‌లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రతిభకనబర్చి సర్టిఫికెట్లు అందుకున్నారు. యెగ్గిన పూర్ణలక్ష్మి, వీరమళ్ళ పద్మశ్రీ, మైనం ప్రదీప్తి, హేమంత్ శివ, రుద్ర మహిమ, ఇస్సాకులు ప్రశంసా పత్రాలు పొందిన వారిలో ఉన్నారు. కణ భౌతిక శాస్త్ర ప్రయోగాలపై వారు ప్రదర్శించిన పోస్టర్ ప్రజంటేషన్‌కు గాను జెనీవా నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ


శివరాత్రి సందర్భంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాశివరాత్రి, భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం (పెద్ద శివాలయం)లో వైభవంగా అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, విశేష పూజలు జరిగాయి. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఊతకోట తాతాజీ, వాణిదేవి దంపతులచే పూజలు, హోమాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ పురాతన పెద్ద శివాలయానికి భక్తులు పెద్ద ఎత్తున రానున్న సందర్భంగా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 6వ తేదీన నిత్యాపాసనలు, బలిహరణలు, 7వ తేదీన దివ్య కల్యాణం, ఈ నెల 8వ తేదీన శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులు దర్శనం, స్వామి వారికి పుష్పాలంకరణ, 9వ తేదీన పుష్పయాగము, 13వ తేదీన గ్రామోత్సవం, పల్లకి సేవ, ఊరేగింపు జరుగుతుందని వెల్లడించారు. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించాలని కోరారు.

బూత్ కన్వీనర్లకు కిట్ల పంపిణీ


తణుకులో పోలింగ్ బూత్ కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేసిన మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు పోలింగ్ బూత్ కమిటీ కన్వీనర్స్ సిద్ధంగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు బాలగంగాధర తిలక్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పోలింగ్ బూత్ కమిటీ కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ కన్వీనర్స్ పాత్రపై పూర్తి అవగాహనతో మెలగాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, ముళ్లపూడి బాబూరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, కొమరవరం సర్పంచ్ కరిబండి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి బెస్ట్ కళాశాల సమీపంలోని మహాత్మా జ్యోతిబాఫూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.సూర్యకుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 31వ తేది లోపు ఆన్‌లైన్ ఫీజు రూ.100లు చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థులు తొమ్మిది నుంచి 11 ఏళ్ల వయస్సు మించరాదన్నారు. 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 మార్చి 31వ తేది మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31వ తేది మధ్య జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఏప్రియల్ 27వ తేదిన పరీక్ష ఉంటుందని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు పరీక్ష మంగళవారం తాడేపల్లిగూడెం, పెంటపాడులో 6 సెంటర్లలో ప్రగతి, జీఎంఆర్, ఆదిత్య, వాసవి, గోయంకా ఉమన్స్, పెంటపాడు జూనియర్ కళాశాలలో నిర్వహించారు. పరీక్షలకు 1,819 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,789 మంది పరీక్షలకు హాజరైయారు. 30 మంది పరీక్షలకు హాజరుకాలేదు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అత్తిలి: మండలంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు తెలిపారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

మహిళలను గౌరవించడం మన బాధ్యత

తాడేపల్లిగూడెం అర్బన్: మహిళలను గౌరవించడం మన బాధ్యతని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు అన్నారు. మార్చి 8వతేదీ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల సమాఖ్య భవనంలో దిశ ప్రొటెక్ట్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మనుపర్తి లలిత, ఉపాధ్యక్షురాలు టి రమావతి, తేజశ్వరి, కార్యదర్శి కె కృష్ణవేణి, పట్టణ అధ్యక్షురాలు బోణం విజయనిర్మల, రాష్ట్ర కోశాధికారి విజయలక్ష్మికుమారి పాల్గొన్నారు.

దేవుని వాక్యానికి విధేయులు కావాలి


ప్రార్థనలో పాల్గొన్న ఘనరాజు, తదితరులు

పెంటపాడు: విశ్వాసులు దేవుని వాక్యానికి విధేయులై, ఆయనకు లోబడి జీవనం సాగించాలని వడాలకు చెందిన వాక్యజ్యోతి మినిస్ట్రీస్ పాస్టర్ కె. ఘనరాజు పేర్కొన్నారు. జట్లపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి క్రీస్తు సువార్త స్వస్థత సభలు రెండో రోజు కార్యక్రమంలో భాగంగా ఆయన దేవుని వాక్యం బోధించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ, పాస్టర్ల సంఘ నాయకులు కె. జాజిరాజులు మాట్లాడుతూ దేవుని ఆధ్యాత్మికంగా సేవించేవారికి ఆయన నిత్యం తోడుంటారన్నారు. ఈ సభల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన సాయిలన్న తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి ఆహ్వానం


ఆహ్వాన పత్రికను మంత్రి కొట్టు సత్యనారాయణకు అందజేస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని రామారావుపేటలోని పునఃనిర్మించిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయం ప్రతిష్ఠ కార్యక్రమం ఏప్రిల్ 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ ఎస్వీ రమణారావు తెలిపారు. రామాలయం పునఃప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను మంగళవారం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ బలుసులమ్మ ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఆలయం కమిటీ తరుపున ఉపముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మాట్లాడుతూ సీజీఎఫ్, భక్తుల సహాయ సహకారాలతో రామాలయం పునః నిర్మాణం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ శేషావతారం, కోశాధికారి గుడివాడ నాగేంద్ర, సభ్యులు రమేష్ పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ


టీబీ రోగులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: కార్మికులు, వారి కుటుంబాల ప్రజలు ఆరోగ్యంగా జీవించాలని త్రివుల్ కర్మాగార సహాయ మేనేజర్ జి. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రత్తిపాడు త్రివుల్ కార్మాగారంలో స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో త్రివుల్ నిర్వాహకులైన ఓపీ గోయంకా తదితరుల సహకారంతో వారి సూచనల మేరకు కార్మికులకు, వారి కుటుంబాలకు పోషకాహార కిట్లు, టీబీ పేషెంట్‌లు ఆరోగ్యంగా ఉండేందుకు గాను బెల్లం, కాజు, బాదం, మిల్లెట్స్‌తో కూడిన కిట్లు రోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర బాలకృష్ణ గోయంకాతో పాటు, స్వాభిమాన్ ట్రస్టు, త్రివుల్ ఎఫ్ కర్మాగార ప్రతినిధులు వేమల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత సభ


సంగీత కచేరి చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో త్యాగరాజస్వామి వారి 83వ ఆరాధనోత్సాలు నాల్గువ రోజు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక బీవీఆర్ కళా కేంద్రంలో మోదుమూడి సుధాకర్‌చే సంగీత సభ జరిగింది. వైలన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, మృదంగంపై కె.యోగీష, ఘటంపై సరస్వతుల హనుమంతరావులు సహకరించారు. ఈ కార్యక్రమంలో బుద్దాల వెంకట రామారావు, గరికపాటి బాపయ్య శర్మ, సంగీత విద్వాంసులు, కళాకారులు, బీవీఆర్ సభ్యులు పాల్గొన్నారు.

విజయవంతమైన ఉచిత కంటి వైద్య శిబిరం


మంచిలి సొసైటీ వద్ద ఉచితంగా కళ్లజోళ్లను అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు

అత్తిలి: మంచిలి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం ఆస్పత్రి సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కంటి వైద్య పరీక్షా శిబిరంలో అవసరమైన 150 మందికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నత్తి పండురెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు వనువులేటి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ రాగిరెడ్డి రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకురాలు బొంతా యశోద తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు మూడు ఎంపీ సీట్లపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు పార్లమెంట్ స్థానాలను బీసీలకు కేటాయించడం పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర గౌడ సంఘం కార్యదర్శి రాముగాని శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరోచిత నిర్ణయం, సాహసం ఏ పార్టీ ఇంతవరకు చేయలేదని ఇది బీసీలు గర్వించదగ్గ విషయమని చెప్పారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

తాడేపల్లిగూడెం అర్బన్: పదో తరగతి పరీక్షల్లో నూటికి 95 శాతం మార్కులు సాధించేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్వీ రమణరావు సూచించారు. స్థానిక సుబ్బారావుపేట మున్సిపల్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోపాలను సరిచూసుకుంటే పరీక్షల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులవుతారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోమండల విద్యాధికారిణి పీఎంకే జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వనజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టిసీమ, వీరంపాలెంకు ప్రత్యేక బస్సులు


డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారిచే తాడేపల్లిగూడెం డిపో నుంచి పట్టిసీమకు, వీరంపాలెంనకు ప్రత్యేక బస్సులు ఈ నెల 7వ తేదీ సాయంత్రం నుంచి 8వ తేదీ రాత్రి వరకు నడుస్తాయని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. వీరంపాలెంకు ఈ నెల 8వ తేదీ శుక్రవారం ఉదయం 5 గంటలనుంచి అర్ధరాత్రి వరకు ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు ఉండే విధంగా బస్సులు నడుస్తాయని తెలిపారు. సురక్షిత ప్రయాణానికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయాలని, పరమశివుని కృపకు పాత్రులు కావాలని కోరారు.